
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 । కనిష్ఠం 27.8
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 జూన్ 2025



- అక్రమ యూరియా తరలింపుపై కొనసాగుతున్న విచారణ
- రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు
- ఫర్టిలైజర్ యజమానులతో చేతులు కలిపి దళారీదందా
- పోలీసులకు ఫిర్యాదు చేయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు
- హోల్ సేల్‌గా ఎరువులను విక్రయించిన వ్యాపారిపై చర్యలు కరువు



యూరియా బస్తా



భీంపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించిన యూరియా బస్తాల లారీ

అసలు సూత్రదారులు ఎవరు?

ఆదిలాబాద్,జూన్19 (ఆంధ్రజ్యోతి): అక్రమ యూరియా తరలింపులో అసలు సూత్రదారులు ఎవరన్నది జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. భీంపూర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న యూరియా లారీపై విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రైతు మిత్ర ఫర్టిలైజర్ యజమానికి అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అయితే హోల్‌సెల్‌గా 18మంది రైతులు యూరియాను కొనుగోలు చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులే విచారణ జరపడం విమర్శలకు దారితీస్తోంది. ఇతరశాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులను విచారణకు ఆదేశించి ఉంటే అసలు భాగోతం బయటపడి ఉండేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గడిచిన 24 గంటల్లోనే యూరియా అక్రమరవాణాలో తీగలాగే కొద్ది డొంక కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భీంపూర్ మండలానికి చెందిన పలువురు రైతుల వివరాలను అధికారులు సేకరించినట్లు తెలిసింది. రైతుల పట్టా పాస్ పుస్తకాలతోపాటు పంటల సాగు విస్తీర్ణాన్ని పరిశీలిస్తున్నారు. అయితే అవసరానికి మించి రైతులు యూరియాను కొనుగోలు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఎరువులను కొనేందుకు ఫర్టిలైజర్ దుకాణానికి రైతులు రాకుండానే వ్యాపారి యూరియాను సరఫరా చేయడం ఏమిటన్న ప్రశ్నలు విన్పి స్తున్నాయి. ఎరువులను విక్రయించే సమయంలో తప్పనిసరిగా బయోమెట్రిక్‌ద్వారా సంబంధిత రైతుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధనలు ఏమీ పట్టించుకోకుండానే ఫర్టిలైజర్ యజమాని యూరియాను విక్రయించినట్లు తెలిసింది. యూరియా లారీపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేయడంతో హుటాహుటిన రైతుల వివరాలను నమోదుచేసి తప్పించుకునే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అడ్డగోలుగా దోపిడీ దందా

అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న దళారులు అడ్డగోలుగా దోపిడీ దందాకు తెరలేపుతున్నారు. చిన్నసన్నకారు రైతులను టార్గెట్ చేస్తూ పెట్టుబడి పేరిట అప్పులతో ఎరవేస్తున్నారు. ఆ తర్వాత అధికవడ్డీలను వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో కొంతమంది దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. భీంపూర్ మండలంలో పట్టుకున్న యూరియా లారీ వెనుక అసలు కథ ఇదేనని తెలుస్తోంది. ఓ దళారీ అమాయక రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అరువుగా ఇచ్చిపంట చేతికొచ్చిన తర్వాత వడ్డీతో సహా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై అదనంగా 5 శాతం వడ్డీని విధిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే హోల్‌సెల్‌గా జిల్లాకేంద్రం నుంచి యూరియా బస్తాలను తరలించి రైతులకు సరఫరా చేసే ప్రయత్నం చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతీయేడు దళారులు రైతులకు విత్తనాలు, ఎరువులను ఉద్దెరపై సరఫరా చేయడం అంద రికీ తెలిసిన విషయమేనన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అంతా కుమ్మక్కు

అధికారులతో వ్యాపారులు, దళారులు కుమ్మకై అక్రమ దందాలకు ఎగబడుతున్నారు. వానకాల సీజన్ ప్రారంభం కాగానే కొంతమంది దళారులు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద మకాం వేస్తూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులను సరఫరా చేస్తున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారన్న విమర్శలు వస్తున్నాయి. ఫర్టిలైజర్ దుకాణదారులు రోజువారి క్రయవిక్రయాలు, స్టాక్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే దీనిపై వ్యవసాయ శాఖాధికారులు తరుచు పర్యవేక్షణ చేస్తూ వ్యాపారులు నిబంధనలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ జిల్లాలో అధికారులు అవేమి పట్టించుకోవడం లేదని అక్రమ యూరియా సరఫరాతో స్పష్టమవుతోంది. యూరియా తరలింపు విషయంలో అధికారులు, ఫర్టిలైజర్

షోకాజ్ నోటీసులు ఇచ్చాం.. విచారణ కొనసాగుతోంది

- శ్రీధర్ స్వామి (జిల్లావ్యవసాయ శాఖాధికారి)

యూరియా అక్రమ రవాణాపై సంబంధిత ఫర్టిలైజర్ వ్యాపారికి షోకాజ్ నోటీసులిచ్చాం. దీనిపై విచారణ కొనసాగుతోంది. ఫర్టిలైజర్ యజమానికి కొంతగడువు సమయమిచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను విక్రయించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రైతుల పేరిట యూరియాను కొనుగోలు చేసినట్లు బిల్లులు ఉన్నాయి. రైతులు కూడా తామే కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. నిజానిజాలు తెలుసుకునేందుకు దీనిపై మరింత లోతుగా విచారణ జరపాల్సి ఉంది.



ఐఏఎఫ్ అధికారితో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఐఏఎఫ్ అధికారిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఎయిర్ ఫోర్స్‌తోపాటు విమానాశ్రయం త్వరగా ఏర్పాటు చేయాలని ఐఏఎఫ్ అధికారి మహంతి జెఎస్‌ను ఆదిలాబాద్ ఎంపీ నగేష్ కోరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి గురువారం ఢిల్లీలో ఐఏఎఫ్ అధికారిని కలిసి విన్నవించారు. అనంతరం ఆయా అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ ఐఏఎఫ్ అధికారి మహంతి జేఎస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో జాయింట్ ఐఏఎఫ్, ఏఏఐ సమావేశం పెడతామని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆదిలాబాద్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించారని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు.

49 జీవోను రద్దు చేసి ఆదివాసీల హక్కులను కాపాడాలి

- మాజీ ఎంపీ సోయంబాపురావు



ప్రభుత్వ సలహాదారుడు వేముల నరేందర్‌రెడ్డితో సోయంబాపురావు

ఆదిలాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 49 జీవోను రద్దు చేసి ఆదివాసీల హక్కులను కాపాడాలని మాజీ ఎంపీ సోయంబాపురావు అన్నారు. గురువారం ప్రభుత్వ సలహాదారుడు వేముల నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్‌కన్జర్వేషన్ పేరిట జారీ చేసిన జీవో నంబర్ 49తో ఆదివాసీల హక్కులకు భంగం కలుగుతోందని తెలిపారు. అలాగే ఆదివాసీ ఉద్యమ సమయంలో ఆదివాసీ గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలన్నారు. వ్యవసాయమే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఆసిఫాబాద్‌లో 339 ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తుడందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా పలువురిపై కేసులు నమోదు చేశారని ప్రభుత్వ సలహాదారుడు వేములనరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే గిరిజన సంఘాల పెద్దల ఆధ్వర్యంలో సీఎంను కలుస్తామన్నారు. దీనికి వేముల నరేందర్ రెడ్డి అన్నిరకాలుగాసహకరిస్తానని హామీఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రిని కలిసిన సోయం

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావును మాజీ ఎంపీ సోయంబాపురావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం మంత్రి చాంబర్‌లో ఇన్‌చార్జీ మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఇన్‌చార్జీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పనితీరు, పలు విషయాలపై ఇన్‌చార్జీ మంత్రితో చర్చించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

సికెల్ సెల్ అనీమియాను నివారిద్దాం

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నివారించాలంటే వైద్యుల సలహాలను, సూచనలను పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామంలో జరిగిన ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోండి భాషలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధి, లక్షణాల గురించి ఆదివాసులకు వివరించారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలు గల వ్యక్తులను వివాహం చేసుకోపోవడమే మంచిదని అన్నారు. వ్యాధి ఉన్న వ్యక్తిలో కొడవలి ఆకారంలో రక్తకణాలు ఉంటాయని చెప్పారు. వ్యాధి ఉన్నవారు 3 నెలలకు రక్తం ఎక్కించుకోవాలన్నారు. అలాగే పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులను ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎంహెచ్ఓ నరేందర్‌రాథోడ్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, డీడీ జాదవ్ అంబాజి, ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, సీడీపీఓ ఉమాదేవి, డాక్టర్లు శికారి సాయి, రాథోడ్ సందీప్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతీఒక్కరు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల వారణాసిలో ఐఐటీ సీటు సాధించిన ఆదివాసీ బిడ్డ పెందూర్ విఘ్నేశ్వర్ అనే విద్యార్థినిని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌గోండు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేస్రంగంగారాం, పెందూర్ ప్రభాకర్, మాదవ్, విఘ్నేశ్వర్ తండ్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యంతో ఎనిమియా వ్యాధిని అరికట్టే వీలుంది

బోథ్: సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధి అనేది వంశపారపర్యంగా సంభవించే వ్యాధిని అరికట్టే ఆస్కారం ఉందని సోనాల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా రోజును పురస్కరించుకొని ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధి ఏ స్టేజిలో ఉందనే విషయం బయటపడుతుందన్నారు. వ్యాధి నయం చేసినందుకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఫార్మసిస్ట్ ఆఫీసర్ మనోహర్, హెల్త్ అసిస్టెంట్ లింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లక్కీ లాటరీ వాయిదా

ఉట్నూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశ లాటరీ వాయిదా వేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్కీ లాటరీని ఈనెల 21న ఉదయం 11 గంటలకు, ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహించబడుతుందన్నారు. మార్పును తల్లిదండ్రులు గమనించి శనవారం జరుగనున్న ప్రవేశ లాటరీకి సకాంలో హాజరు కావాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్

'బీజేపీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి'

జైనథ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పదకొండేళ్ల పాలనలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా మారిందని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. వికసిత్ భారత్‌సంకల్ప సభలో భాగంగా గురువారం జైనథ్‌లోని నిరాల గ్రామంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ మండల పార్టీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 21 యోగాదివాస్, 23న బలిదాన్ దివాస్‌ను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జైనథ్ మండల అధ్యక్షుడు లోకకరుణాకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బోయర్ విజయ్, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్‌చంద్ర, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్, కట్కం రాందాస్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విఠల్, రవి, లక్ష్మణ్, వినోద్, కిరణ్, శ్రీధర్, భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

ఉట్నూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద గంగాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి రాపల్లిఆశన్న అకస్మీకంగా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలకు చెందిన పలు రికార్డులను పరిశీలించి ప్రధాన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రతిస్పందన బాగుందని పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సిబ్బందిని ఆదేశించారు.

భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

సిరికొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల తహసీల్దార్ తుకారాం అన్నారు. గురువారం సిరికొండ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పాల్గొని రైతులకు భూమి సమస్యలు ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం కోసం నేరుగా సంప్రదించాలని అన్నారు. సిరికొండలో 27 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్ ఉపేందర్, ఆర్ఐలు వెంకట్‌రావ్, రాజేశ్వర్, సర్వేయర్ గణేష్, భూభారతి ఆపరేటర్ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దర్బతండాలో భూభారతి సదస్సు

నేరడిగొండ: భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎంఎ కలీమ్ అన్నారు. గురువారం మండలంలోని దర్బతండా, నాగమల్యాల్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుల్లో దీర్ఘకాలిక భూ సమస్యలు, భూ తగాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఆర్ఐ నాగోరావు, ఏఈఓలు గజేందర్, స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కిరణ్, అరుణ్, రెవెన్యూ అధికారులు రవిందర్, మీరాబాయి, పెద్దులు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నేరడిగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. గురువారం మండలంలోని చించోలి, కుప్టి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం సికిల్‌సేల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, హెచ్ఈఓ పవార్ రవిందర్, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఫార్మసిస్ట్ స్వప్న, ల్యాబ్ టెక్నిషియన్ మౌనిక, స్టాఫ్ నర్సు సూర్యకళ, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఆశ కార్యకర్త భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అదుపు చేసేందుకే అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



అభయ మైటాక్సీ స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ, సీఐ, ఎస్సైలు

ఉట్నూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను అదుపు చేయడానికే అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్ అనే కార్యక్రమం ప్రారంభించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలోని సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మొదటిసారిగా ప్రయాణికుల భద్రత, ప్రజల రక్షణ కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఉట్నూర్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో 850 ఆటోల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామన్నారు. ఆటో ముందు, వెనుక భాగంలో క్యూఆర్ కోడ్, లోపల ఆటో నడిపే వ్యక్తి వివరాలతో కూడిన సమాచారం ఈ అభయ పోస్టర్లలో ఉంటుందన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థులు, ప్రయాణికులకు సులువుగా వినియోగించే సౌలభ్యానికి ఈ పోస్టర్లు దోహద పడతాయన్నారు. క్యూఆర్ కోడ్ కలిగిన ఆటోలలో ప్రజలు ప్రయాణం చేయడానికి పోలీసుల భద్రత నమ్మకాన్ని పొందుతారన్నారు. ఆటో డ్రైవర్లు, యజమానులు రూ.350 రిజిస్ట్రేషన్, ఒక సంవత్సరం వరకు చెల్లించుకుంటే లక్ష ప్రమాద భీమా వర్తింపు అవుతుందన్నారు. యువతులు మహిళలు ప్రయాణికులు భద్రతచర్యలలో భాగంగా జిల్లాలోని ఇప్పటివరకు 3232 ఆటోలలో అభయ మై టాక్సీ ఈస్ సేఫ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ, ఉన్నతాధికారులు కలిసి అభయ మై టాక్సీ ఈస్ సేఫ్ కార్యక్రమ పోస్టర్‌ను విడుదలచేసి ప్రారంభించారు. ఆటోలు, టాక్సీలు దొంగతనానికి గురైనప్పుడు వెంటనే సీసీటీవీ కెమెరాల ఆధారంగా కనుక్కునే సౌలభ్యం పోలీసు యంత్రాంగానికి ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా ఆటో వద్దకు వెళ్లి అభయమై టాక్సీ ఇస్ సేఫ్ పోస్టరును ఆటో కు అతికించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏ ఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



ఆటోలకు స్టిక్కర్లు పెడుతున్న ఎస్పీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, జూన్19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని జిల్లా డీఈఓ ఎనుగు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం పిప్రి ప్రభుత్వ పాఠశాలలో చదివి 550 మార్కులు సాధించిన విద్యార్థిని అభినందించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్‌గుప్తా, సీఆర్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన

ఉట్నూర్, జూన్19 (ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయుష్ వైద్యురాలు డాక్టర్ సమీనాఖానం అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత యోగా కార్యక్రమాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఈనెల 21న యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది షాకిర్, శివరాం, యోగా ఇన్‌స్ట్రక్టర్ మల్లేష్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి రోడ్డును కాపాడాలి

బోథ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారుల నుంచి రోడ్డును కాపాడాలని పొచ్చేర గ్రామ రైతులకు గురువారం బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర వినతిపత్రం అందజేశారు. గుట్టచేను వైపు వెళ్లేందుకు ఇబ్బందులకు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక అటువైపు నుంచి వెళ్లే సోమన్న ఆలయానికి సైతం రోడ్డు లేకుండా పోతోందని, ఒకప్పుడు 33 ఫీట్ల వెడల్పు ఆక్రమణకు గురైందని ఆ రోడ్డును కాపాడాలని కోరారు. చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు.

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

ఉట్నూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యశిబిరం ఎంతో అవసరమని, ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి జాదవ్ రామ్‌కిషన్‌నాయక్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షులు షరీఫ్, ప్రధాన కార్యదర్శి కట్టలక్ష్మణచారి, ఉపాధ్యక్షుడు దామెర కనకారావు, కోశాధికారి మడావి లక్ష్మీకాంత్, డాక్టర్ దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐవో జాదవ్ గణేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జూనియర్ కళాశాల తనిఖీ

● కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి: డీఐఈవో జాదవ్ గణేష్

తలమడుగు, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు తగ్గిపోయారనే విషయంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన 'విద్యార్థుల్లేక కళ తప్పిన కళాశాల' అనే కథనానికి అధికారులు స్పందించారు. గురువారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ గణేష్ తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలపై చర్చించారు. కేవలం 22మంది విద్యార్థులు జాయిన్ కావడంపై అసహనం వ్యక్తం చేశారు. అధ్యాపకులుగా గ్రూపులుగా ఏర్పడి గ్రామాల్లోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ విషయాన్ని ఉన్నతాధికార దృష్టికి తీసు కెళ్తామన్నారు.

గుడుంబా అమ్మితే కఠిన చర్యలు: ఎక్సైజ్ సీఐ

ఇచ్చోడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గుడుంబా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బజార్‌హత్నూర్ మండలం టెంబి గ్రామానికి చెందిన సిడాం భీంరావ్ గుడుంబా కేసు లో పలుమార్లు పట్టుబడగా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని సీఐ తెలిపారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తి ఈనెల 13న తన ఇంట్లో గుడుంబా అమ్ముతూ పట్టుబడడంతో బైండోవర్ కేసులో ఉన్న భీంరావ్ కేసును ఉల్లంఘించినందుకు రూ. 50వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు.

'రైతు భరోసాపై మంత్రి ప్రకటన అవాస్తవం'

నేరడిగొండ, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాలలోపు రైతులకు రైతుభరోసా అందిందనే రాష్ట్ర మంత్రుల ప్రకటనలు అవాస్తవని బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత మూడు దఫాలుగా రైతు భరోసా నిధులు రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందని, మంత్రులు అబద్ధపు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఎకరం రైతులకు సైతం సరిగా డబ్బులు జమ కాకున్నా గురువారంతో ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు పూర్తిగా రైతు భరోసా నిధులు జమ చేశామని మంత్రి ప్రకటన చేయడం సమంజసం కాదని విమర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు ముస్సిఫ్ కోరారు. గురువారం విద్యారంగ సమస్యలపై ఎంఈవో మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపా ధ్యాయులను నియమించాలన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయం

● అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి
● ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తమ ధ్యేయమని ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి భారీ కేక్‌కట్ చేసి జై కాంగ్రెస్, జై రాహుల్ గాంధీ అంటూ నినాదాలతో నేతలు హోరెత్తించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల కోసం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో పాస్ చేయించి కేంద్రం ఆమోదానికి పంపించేలా రాహుల్‌గాంధీ కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుడిపల్లి నగేష్, సాయిచరణ్‌గౌడ్, మునిగెల నర్సింగ్, గిమ్మసంతోష్, ఎంఎ షకీల్, బండారి సతీష్, రామ్‌కుమార్, జాఫర్‌అహ్మద్, బూర్లశంకరయ్య, దాసరి ఆశణ్ణ, బొజారెడ్డి, అల్చెట్టినాగన్న, కొండూరి రవి, తుమ్మ ప్రకాష్, ఎల్మరామ్‌రెడ్డి, మేకల, రాజాలింగన్న, సంజయ్‌రెడ్డి, నిమ్మలగౌతమ్‌రెడ్డి, మహిళ నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, లత, సోనియా, రూప, అఫ్రోజా, తదితరులున్నారు.

ఉట్నూర్‌లో..

ఉట్నూర్: దేశంలో అలుముకున్న చీకటిని తొలగించడానికి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నఫ్రత్ చోడో భారత్‌జోడో యాత్రను చేపట్టి దేశాన్ని ఏకతాటిపై తెచ్చిన మహానేత రాహుల్‌గాంధీ అని ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా ప్రతీ కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేయాలని ఎమ్మెల్యే పిలుపనిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఖయ్యుం, ఆర్టీఓ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, లింగంపల్లి చంద్రయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని హస్నాపూర్‌లో మాజీ ఉపసర్పంచ్ నేదునూరి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

నార్నూర్‌లో..

నార్నూర్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను తాడిహత్నూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఇంద్రా పిలోషిప్ శక్తి అభియాన్ మండల కోఆర్డినేటర్ కుమ్ర సింధు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు కేక్‌కట్ చేసి తినిపించి వారికి పాఠ్యపుస్తకాలను పెన్నులు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఇరాడే విఠల్, అరికెల దశరథ్, అంజలి, ప్రధాన ఉపాధ్యాయులు రామరావు పాల్గొన్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ దేశ రాజకీయాలను శాసిస్తున్న రాహుల్ గాంధీ వర్తమాన రాజకీయాలలో దేశంలో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న నేత రాహుల్ గాంధీ అని అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్. నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, నేరడిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హీరాసింగ్ , బోథ్ మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

గుడిహత్నూర్..

గుడిహత్నూర్: మండల కేంద్రంలో గురువారం అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అరిఫ్ ఖాన్, పవార్ రాజు, నరేష్, విష్ణు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, మెస్రం నాగనాథ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహర్, జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, నాగోరావు, మహిళ అధ్యక్షురాలు సోన్ కాంబ్లే లక్ష్మిబాయి, తదితరులు పాల్గొన్నారు.

మావలలో..

మావల: ఏఐసీసీ అగ్రనేత, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఫెరోజ్ ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతుబంధు ఎన్నికల బందుగా మారింది

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులు జమ చేస్తుందని, రైతుబంధు ఎన్నికల బందుగా మారిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు.రైతులకు అన్యాయం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు సైతం ఇదే రీతిన రైతుబంధు వేసి యాసంగి పంటల సీజన్‌లో నాలుగు ఎకరాల వరకే రైతుబంధు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. రైతుబీమా సైతం అమలు చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ యోజనలోను రైతుల సంఖ్యను భారీగా తగ్గించిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో రైతులకు అన్యాయం చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రైతుల పక్షాన వారికి న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇందులో మాజీ మార్కెట్ చైర్మన్లు యాసంనర్సింగ్ రావు, మెట్టు ప్రహ్లాద్, మేస్రం పరమేశ్వర్, అశోక్ స్వామి, పండ్ల శ్రీనివాస్, డైరెక్టర్ పరమేశ్వర్, కుమ్రరాజు, దయానంద్, తిరుపతి, జంగిల్‌ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

అసలు సూత్రదారులు ఎవరు

(5వ పేజీ తరువాయి)

యజమాని నిబంధనలను గాలికి వదిలేయడంతోనే భీంపూర్ మండలానికి చెందిన ఓ దళారీ హోల్‌సెల్‌గా 10 మెట్రిక్ టన్నుల యూరియాను యథేచ్ఛగా కొనుగోలు చేసినట్లు తెలుస్తోం ది. అయితే ఐదు ఎకరాలు ఉన్న రైతు ఏకంగా 15 బస్తాలు కొనుగోలు చేయడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందులో తప్పిదం ఎవరిదన్నది జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

అధికారులపై ఒత్తిళ్లు

భీంపూర్ మండలం అందర్‌బంద్ గ్రామానికి హోల్‌సెల్‌గా తరలించిన యూరియాను ఇతర వాహనాల్లో డంపు చేస్తుండగా అనుమానం వచ్చి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు యూరియా లారీని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే ఇప్పటివరకు వ్యవసాయ శాఖాధికారులు పోలీసులకు ఫిర్యాదులు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదుచేసి ఉంటే అసలు సూత్రదారి ఎవరన్నది ఈ పాటికే బయటపడి ఉండేదన్న టాక్ వినిపిస్తోంది. హోల్‌సెల్‌గా యూరియాను తరలించిన స్థానిక దళారీని కాపాడేందుకే అధికారులు లోతుగా దర్యాప్తు జరుపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఓ పార్టీకి చెందిన నియోజకవర్గస్థాయి నేత ఒత్తిళ్లతోనే అధికారులు ఫిర్యాదు చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. గత కొద్దిరోజులుగా జిల్లాలో వడ్డీ వ్యాపారులు, దళారులపై ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించడంతో కొంతమంది సైలెంటై పోయారు. అయిన మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో అమాయక రైతులకు అప్పులు ఇస్తూ పంట చేతికి రాగానే అధిక వడ్డీలతో పాటు అసలును వసూలు చేసే పద్ధతి ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇటీవల పట్టుబడిన యూరియా లారీపై పోలీసులు లోతుగా దర్యాప్తు జరిపితే అసలు సూత్రదారుల బాగోతం బయట పడే అవకాశం ఉందంటున్నారు.

హైదరాబాద్‌లో కప్పర్లవాసి ఆత్మహత్య

తాంసి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన జాజి మొగ్గ శంకర్ (56) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వాలీబాల్ ఆటలో జిల్లా స్థాయి నుంచే కాకుండా రాష్ట్రస్థాయిలో రాణించిన శంకర్ అందరితో కలుపుగోలుగా ఉండేవారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

పలు కుటుంబాలకు మాజీ ఎంపీపీ పరామర్శ

బోథ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్డిబి గ్రామానికి చెందిన బందు పటేల్ మాజీ ఎంపీటీసీ భార్య ఇటీవల అనారోగ్యం ఆయన కుటుంబాన్ని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. అలాగే సాకెర గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సకారం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను తుల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. సోనాల మండల కేంద్రానికి చెందిన బోరిగేపు రాజారాం రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు సుధీర్ రెడ్డి, ఈర్ల అభిలాష్, సోషల్ మీడియా కన్వీనర్ భీమ్రావు పాటిల్, మునేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ

నేరడిగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని బుద్ధికొండ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తానని అన్నారు. అంతకుముందు ఆయనను గ్రామస్థులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, కళ్లెం నారాయణరెడ్డి, బద్దం పోతారెడ్డి, బుద్ధికొండ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని విద్యార్థులకు

అసౌకర్యం కలుగకుండా చూడాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



భైంసా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల నిర్వహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో మెరుగుపరచి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు, వివిధ రెసిడెన్షియల్ స్కూల్స్, సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాల్స్, వార్డెన్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వసతి గృహాల నిర్వాహకులు విద్యార్థులను స్వంత పిల్లల్ల చూసుకోవాన్నారు. మెను ప్రకారం భోజన ,అల్పాహార వ్యవస్థ కొనసాగాలన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

నర్సాపూర్(జి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ సొంతిళ్లు ఉండాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఈ కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నర్సాపూర్(జి) మండలానికి చెందిన 49 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు పార్టీ కమిటీ సభ్యులు ఘనంగా భూమి పూజ చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఇంద్రకరణ్‌రెడ్డి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, కాంగ్రెస్ నాయకులు దేవేందర్, అన్వర్, గజ్జారాం, ఉమామహేశ్వర్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమపై

కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయాలి

సోన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన కోట్పా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21, 22న నిజామాబాద్ టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గురువారం రోజున సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఏడు లక్షల మంది బీడీ కార్మికులు ఉపాధి పొందుతున్నారని వీరి బ్రతుకులపై కేంద్ర ప్రభుత్వం చర్యల వలన ఉపాధి కరువవుతుందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కోట్పా చట్టం ఆంక్షలతో బీడీ పరిశ్రమ నిర్వీర్యం అవుతుందని బీడీ కార్మికులను ఆదుకోవాలన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి జీవన భృతి ప్రకారం కేంద్ర ప్రభుత్వం కూడా జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. బీడీ పరిశ్రమపై 28 శాతం జీఎస్టీ విధించడంతో బీడీ పరిశ్రమ రోజురోజుకు తగ్గిపోతుందని, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. బీడీ కార్మికుల కనీస పెన్షన్ రూ. 9 వేల రూపాయలు అమలు చేయాలని బీడీ కార్మికులందరికీ పీఎఫ్ ఐడెంటీ కార్డు, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కార్మికులందరికీ తెలంగాణ ప్రభుత్వం జీనవ భృతి అమలు చేయాలని కోరారు. ఈ నెల 21, 22న టీయూసీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాన్ని రూపొందించుకొని కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తారని తెలిపారు.

నిర్మల్ జిల్లాలో ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పీసీసీ పరిశీలకులు అవేజ్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాలకు పార్టీలో సముచితస్థానం కల్పించి వారి సంక్షేమానికి రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారన్నారు. దేశప్రజలను ఏకం చేయడానికి కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్‌జోడో యాత్ర చేపట్టారన్నారు. పార్లమెంట్‌లో ప్రజల పక్షాన నిలబడి, భారత రాజ్యాంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ఏకైక వ్యక్తి రాహుల్‌గాంధీ అని కొనియాడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమభీమ్‌రెడ్డి, అబ్దుల్‌హాది, మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పట్టణ అధ్యక్షులు చిన్ను, మాజీ ఎంపీపీలు కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, పాల్దె అనిల్, మాజీ ఏఎంసీ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, మాజీ కౌన్సిలర్లు నల్లూరి పోశెట్టి, నరేందర్, నేరెళ్ల వేణు, గండ్రత్ రమణ, మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

కుంటాల, జూన్, 19 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పీసీసీ రాష్ట్ర పరిశీలకులు ఎండీ అవేజ్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల స్థానిక మున్నూరుకాపు సంఘంలో ఏర్పాటు చేసిన కుంటాల మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్వహించే ఎన్నికను కాంగ్రెస్ పార్టీ గుజరాత్ తరహాలో నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామ స్థాయి కార్యకర్తల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రతి దరఖాస్తును కార్యకర్త క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తు ఫామ్‌ను పూర్తి చేసి తమకు అప్పగిస్తే పరిశీలన జరిపి అర్హులైన వారందరికి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పదవుల ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని కేక్‌కట్ చేశారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, సహకార సంఘం చైర్మన్ సట్ల గజ్జారాం పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న పీసీసీ పరిశీలకులు అవేజ్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

విపత్తు వేళ.. మహిళా శివంగులు

● నిర్మల్ జిల్లాలో ప్రత్యేక బృందం ఏర్పాటు
● రాబోయే వర్షాకాలం వరదలకు సిద్ధం చేసిన అధికారులు



విపత్తు నిర్వహణ సహాయక పోలీస్‌బృందంతో ఎస్పీ జానకీ షర్మిల

బాసర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళా కమాండర్‌లతో విపత్తు సమయంలో చేపట్టే సహాయక చర్యలకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారికి అన్ని విధాలుగా శిక్షణ ఇచ్చి సిద్ధం చేశారు. వచ్చే వర్షాకాలంలో నదులు, వాగులు పొంగి వరదలు ఏర్పడితే బాధితులను సురక్షితంగా రక్షించేందుకు ముందు జాగ్రత్తగా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఈ బృందం గురువారం బాసర గోదావరి నదిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులను ఎలా రక్షించాలో చేసి చూపించారు. ఈ కమాండర్‌లు జాతీయస్థాయి బృందాల వలే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు.

పాఠశాల బస్సులపై ఆర్‌టీఏ అధికారుల ముమ్మర తనిఖీలు

● నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని వెల్లడి ● జిల్లాలో 234 పాఠశాల బస్సుల్లో 215 బస్సుల ఫిట్నెస్ పరీక్షల పూర్తి

భైంసా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పాఠశాల బస్సులపై గురువారం అర్‌టీఏ అధికారుల బృందం ముమ్మర తనిఖీలను చేపట్టింది. మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ దూప్‌సింగ్ నేతృత్వంలోని బృందం పాఠశాల బస్సులు రాకపోకలు కొనసాగే మార్గంలో మకాం వేసి తనిఖీలు చేపట్టారు. ఆయా బస్సుల స్థితిగతులు, పరికరాల పనితీరును పరిశీలించారు. బస్సు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంవీఐ దూప్‌సింగ్ మాట్లాడుతూ అర్‌టీఏ నియమ,నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల బస్సులను రోడ్లపై తిప్పితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పాఠశాల బస్సుకు ఫిట్నెస్ , ఇన్సూరెన్స్ ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలని సూచించారు. ఇదే క్రమంలో అనుభవజ్ఞులైన డ్రైవర్‌తో పాటు క్లీనర్ కూడా తప్పకుండా ఉంచాలన్నారు. వీటిల్లో ఏది లేకున్న కేసులు తప్పవని వెల్లడించారు. అంతేకాకుండా సామర్థ్యానికి మించి బస్సులో విద్యార్థులను తీసుకెళ్ల రాదని పేర్కొన్నారు. కాగా జిల్లాలో మొత్తం 234 పాఠశాల బస్సులు ఉండగా గురువారం వరకు 215 బస్సుల ఫిట్నెస్ పరీక్షలు పూర్తయినట్లుగా అర్‌టీఏ అధికారులు వెల్లడించారు. మరో 19 బస్సుల ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.



భైంసాలో స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ దూప్‌సింగ్

యోగా డే సందర్భంగా టీ షర్ట్‌ల పంపిణీ



యోగా దినోత్సవం సందర్భంగా టీ షర్ట్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్మల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి నార్లపురం రవీందర్ టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. పట్టణంలోని దివ్య నగర్ కాలనీలో గల వశిష్ట యోగా కేంద్రం వద్ద గురువారం ఉదయం ఈ పంపిణీ కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా యోగా శిక్షకులు బాలాజీ మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా యోగా డే సందర్భంగా నార్లపురం రవీందర్ ఈ టీ షర్ట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ నెల 21న ఉదయం 7 గంటల నుంచి 8:30 గంటల వరకు స్థానిక దివ్యగార్డెన్‌లో వశిష్ట యోగా సంఘటన్, ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా డే కార్యక్రమంలో నిర్మల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వశిష్ట యోగా సంఘటన్ అధ్యక్షులు డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్, వైద్యులు కూన ప్రవీణ్ కుమార్, సతీష్, శశి రాజ్, శ్రీనివాస్, గంగాధర్ గౌడ్, శ్రీవాణి, దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ ప్లెక్సీ ఆవిష్కరణ

సోన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి యోగా దినోత్సవం ప్లెక్సీలు ఆవిష్కరించారు. మెడికల్ ఆఫీసర్ టి. రాంప్రసాద్ మాట్లాడుతూ... ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. యోగా నిత్య జీవితంలో భాగం కావాలని, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ప్రకాష్, ఎంఎన్‌వో పంజక్, పీటీఎస్ నిఖిల్ పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాలు, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (గర్ల్స్) లెఫ్ట్ పోచంపాడ్ పాఠశాలలో యోగాసనాలు , ప్రాణాయామ కార్యక్రమాలు నిర్వహించారు. యోగా శిక్షకులు సతీష్, వనిత ఆధ్వర్యంలో జీఏడీ సోన్ వైద్య అధికారి డా. వైష్ణవి, ఫారస్మసిస్టు వెంకటేష్, ఎస్ఎన్‌వో గంగాధర్, ప్రిన్సిపాల్ ప్రశాంతి, పాఠశాల సిబ్బందితో నిర్వహించారు.

మురికినీరు, రోడ్ల సమస్యలు పరిష్కరించండి

● నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని నగర్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో నెలకొని ఉన్న మురికి నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురికినీరు రోడ్లపై పారుతోందని అలాగే రోడ్ల పక్కన నీరు నిల్వ ఉండడంతో వర్షాకాలంలో దోమలు చేరి అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని, ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధి, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షులు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి శివరాం వెంకటేష్, కోశాధికారి చిటిమల సదయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ బచ్చు రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో బ్యాంకుల్లో రైతుల రద్దీ

భైంసా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు రద్దీగా మారాయి. ఉదయం 10 గంటల నుంచే అన్నదాతలు బ్యాంకులకు తరలివచ్చి నగదును తీసుకునేందుకు పోటీపడుతున్నారు. పలు ప్రాంతాల్లో ఉదయం బ్యాంకు పని వేళలు ప్రారంభమవ్వక ముందే అన్నదాతలు నగదు కోసం తరలివస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. కొన్ని చోట్ల బ్యాంకు నిల్వలు సరిపోక పోతుండటంతో కొందరు రైతులు వెనుదిరిగిపోతున్నట్లుగా సమాచారం. ఇలాంటి పరిస్థితి నెలకొన్న ప్రాంతాల్లో అన్నదాతలు ప్రత్యామ్నాయ చర్యగా ఇతర ఖాతాల్లోకి డబ్బులు బదిలీ చేసుకుంటున్నట్లుగా సమాచారం.



నిర్మల్ ఆదిలాబాద్ ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

రోడ్డుపై మురికి నీరు రాకుండా చర్యలు

బోథ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని నిర్మల్ ఆదిలాబాద్ వెళ్లే రోడ్డుపై మురికి నీరు వారి గుంతలుగా ఏర్పడింది. దీంతో రోడ్డుపై మురికినీటి సమస్యలు తీర్చాలంటూ ఆంధ్రజ్యోతిలో శనివారం వార్త కథనం ప్రచురితమైంది. దీంతో బోత్ గ్రామ పంచాయతీ ఈవో అంజయ్య స్పందించారు. వెంటనే పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని పిలిపించి మురికి కాలువను శుభ్రం చేయించారు. రోడ్డుపై నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఫలితంగా మురికి నీరు రోడ్డుపై రాకుండా ఉంది.



మురికి కాలువ ఏర్పాటు చేయడంతో పరిశుభ్రంగా మారిన రోడ్డు

వర్షాలు లేక ఎండిపోతున్న పత్తి మొలకలు

తాంసి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలు పెట్టుకొని తొలకరి జల్లుకే విత్తనాలు నాటిన రైతాంగానికి మళ్లీ నష్టం వాటిల్లింది. ఈనెల 8వ తేదీ నుంచి రైతులు విత్తనాలు నాటారు. మొదట్లో రెండు మూడు వర్షాలు బాగానే కురిసినప్పటికీ గత వారం రోజుల నుంచి వర్షాలు మొండికేసాయి. దీంతో మొలకెత్తే విత్తనాలన్నీ మండుతున్న ఎండలకు మాడిపోతున్నాయి. దీంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. అప్పులు ఇచ్చే నాథుడు లేక ఇంట్లో ఉన్న వస్తువులను తాకట్టు పెట్టి విత్తనాలు తెచ్చుకుంటే మళ్లీ తమకు కష్టాలు ఎదురయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశంలో వర్షం కురిసేలా మబ్బులు కనిపిస్తున్నప్పటికీ చినుకు జాడ కరువైందని అంటున్నారు. ప్రస్తుతం ఎకరానికి ఐదు నుంచి 8 వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు.



మొలక దశలోనే ఎండిపోతున్న పత్తి మొలకలు

ప్రభుత్వ కళాశాల పిలుస్తోంది..!

● సకల సౌకర్యాలతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ● అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యా బోధన ● అందుబాటులోకి నూతన కోర్సులు



ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

'ఆంధ్రజ్యోతి' పరిశీలన



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న ఇచ్చోడ కళాశాల అధ్యాపకులు



కళాశాలల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వసతులతో తరగతి గదులు, పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం.. విశాలమైన క్రీడా మైదానంతో ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకట్టుకుంటుంది. ఇచ్చోడ పరిధిలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన పేద బాలురు వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో చేరి ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సూచిస్తున్నారు. అందుబాటులో అన్ని సౌకర్యాలతో ఉన్న ప్రభుత్వ కళాశాలలో చేరాలను కోరుతున్నారు.

ప్రత్యేకతలు ఇలా..

అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనలో కళాశాల విద్యార్థులు ఎలా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు ఉచిత విద్యా బోధన, పాఠ్యపుస్తకాల పంపిణీ, గ్రంథాలయ సౌకర్యం, ఆధునాతన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ఉపకార వేతనం, ప్రాంగణ నియామకాలు, ప్రేరణాత్మక వర్క్ షాపులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. కళాశాలలో చేరాలనుకునేవారు నేరుగా రావచ్చు. ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా సైతం ప్రవేశం పొందవచ్చు.

కళాశాలల్లో ఉన్న కోర్సులు..

ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి కల్పన కోర్సులు ఉన్నాయి. ఎంపీసీ బైపీసీ, సీఈసీ, ఎంఈసీ వంటి కోర్సులు ఏళ్లుగా ఉండగా.. మూడెళ్ల నుంచి ఎంఈసీ (మ్యాథ్స్ ఎకానమిక్స్, కామర్స్), ఎంఎల్‌టీ (మెడికల్ లాబోరెటరీ టెక్నలజీ), ఎంపీఎస్‌డబ్ల్యూ (మెడికల్ అండ్ సైకియాట్రిక్ సోషల్ వర్క్), ఆర్ఎమ్ (రిటైన్ మేనెజ్ మెంట్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

అంకితభావంతో బోధన

-శంకర్, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, ఇచ్చోడ



ప్రైవేటుకు దీటుగా అంకితభావం కలిగి అధ్యాప కులతో బోధన అందజేస్తున్నాం. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూస్తున్నాం. ప్రైవేటులో చేరి.. ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి.



ప్రచారం నిర్వహిస్తున్న ఇచ్చోడ కళాశాల అధ్యాపకులు

ఆదర్శం..ఆ ఉపాధ్యాయుడు

● ముగ్గురు సంతానాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిపిస్తున్న వైనం



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న హస్నాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతి

ఉట్నూర్, జూన్19 (ఆంధ్రజ్యోతి): ప్రతీనెల లక్షల రూపాయల వేతనాన్ని నమ్ముకున్న టీచర్ ఉద్యోగంతో పొందుతున్న ఆ టీచర్ తన ముగ్గురు సంతానాన్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వేల రూపాయలతో ఉద్యోగాలు చేసే చిన్న ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి చదివిస్తున్న ఈ రోజులలో ఉమ్మడి జిల్లాలోని జైనూరు మండలం పానాటార్ ఆశ్రమ పాఠశాల (బాలురు)లో హిందీ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న చౌహాన్ పరమేశ్వర్ గురువారం తన కుమారుడు చౌహాన్ తులిసిదాస్‌ను ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో ఉన్న జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం తీసుకున్నారు. అంతేకాకుండా తన కుమార్తె చౌహాన్ పాయలకూడా ఇదే స్కూల్లో 8వ తరగతి చదువుతుండగా అలాగే తన చిన్న కూతురు చౌహాన్ ప్రీతి కూడా హస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతుంది. తన ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిపిస్తున్న చౌహాన్ పరమేశ్వర్‌ని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హస్నాపూర్ హెడ్మాస్టర్ తిరుపతి పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్ పాస్‌లకు వేళాయే!

● వివరాల నమోదు కీలకం
● ఆన్‌లైన్ విధానంలో జారీ

భైంసా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా సంవత్సరం (2025-26) ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమైంది. అదే రోజు నుంచి బస్ పాసుల జారీ చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్లలోని జారీ కౌంటర్లలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలకు, 12 ఏళ్లలోపు గల బాలురకు 20 కి.మీల పరిధి వరకు ఉచితంగా బస్ పాసుల జారీ చేస్తారు.

● దరఖాస్తులు చేసుకోండిలా..

అవసరమైన విద్యార్థులు ఆన్‌లైన్.టీజీఎస్ఆర్‌టీసీ పాస్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం దరఖాస్తు పత్రాన్ని ప్రింట్ తీసుకొని దానిపై పాస్ పోర్టు సైజు ఫోటో, చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం, స్టాంపు వేయించి బోనఫైడ్ ధ్రువపత్రాన్ని జత చేసి బస్టాండ్‌లోని బస్సు పాసుల జారీ కౌంటర్‌లో అందించి పాస్ పొందవచ్చు. ప్రభుత్వ విద్యా సంస్థలు తమ పాఠశాల, కళాశాల పేరు, ప్రధానోపాధ్యాయుడు/ప్రిన్సిపాల్ పేరు, ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ తెలియజేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత యూజర్ ఐడి, పాస్‌వర్డ్ ఇస్తారు. వీరికి అడ్మినిస్ట్రేటివ్ రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రైవేటు విద్యా సంస్థలు మాత్రం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్దేశిత రుసుము చెల్లిస్తేనే వారి విద్యార్థులకు పాసులు జారీ చేస్తారు.



విద్యార్థులకు అందించే బస్సు పాస్, గుర్తింపు కార్డులు



భైంసా బస్టాండ్‌లోని ఆన్‌లైన్ బస్సు పాస్ కేంద్రం



భైంసాలో విద్యార్థులకు పాసులను జారీ చేస్తున్న కేంద్రం ఇన్‌చార్జ్



భైంసా కేంద్రంలో బస్సు పాసుల కోసం వరుసలో నిల్చున్న విద్యార్థులు

● బ్యాంకు డీడీలు ఇలా..

అకౌంట్ ఆఫీసర్, టీఎస్ఆర్‌టీసీ, ఆదిలాబాద్, అకౌంట్ నెంబరు 002211010000013, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0800228 పేరిట ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డీడీ తీసి సంబంధిత అధికారికి అందజేయాలి. డీడీలు చెల్లించిన జిరాక్స్ ప్రతులను ఆయా డిపోల పరిధిలో అందజేస్తే తర్వాత విద్యా సంస్థల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ జారీ చేస్తారు.

● సద్వినియోగం చేసుకోవాలి..

(హరిప్రసాద్, మేనేజర్, బస్సు డిపో, భైంసా)

విద్యా సంస్థ పేరు నమోదు కాకపోతే విద్యార్థులకు పాసులు జారీ కావు.వివరాల నమోదు ప్రక్రియలో జాగరుకతతో వ్యవహరించాలి. విద్యా సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు పూర్తి సమాచారం, సందేహాల నివృత్తికి బస్ పాసుల జారీ కౌంటర్‌లో సంప్రదించాలి.

● నమోదుకు ప్రైవేటు విద్యా సంస్థలు.. చెల్లించాల్సిన రుసుము

విద్యాసంస్థలు	వార్షిక రుసుము	రెన్యూవల్ రుసుము
ఐటీఐలు, కాలేజీలు	రూ. 5వేలు	రూ. 4వేలు
200లోపు విద్యార్థులుంటే	రూ. 750	రూ. 750
500లోపు విద్యార్థులుంటే	రూ. 1000	రూ. 1000
500కు పైగా విద్యార్థులుంటే	రూ. 2000	రూ.1500



ముంపుకు గురైన మేదరి కాలనీ (ఫైల్)

వరద ముంపు.. లోతట్టుకు ముప్పు!

కుబీర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వానాకాల ప్రారంభమైంది. భారీ వర్షం కురిసిందంటే కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. ఇళ్లలోకి వరద నీరు వచ్చి కంటిమీద కునుకు లేకుండా చేస్తాయి. కొన్ని సంవత్సరాలుగా సమస్య నెలకొన్నప్పటికీ సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని మేదరి కాలని ముంపు ప్రాంత ప్రజలు తమ సమస్య పరిష్కరించాలని మండల అధికారులకు ప్రజాప్రతినిదుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

● అక్రమ నిర్మాణాలతోనే వరద ముంపు..

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ పక్కన గల ప్రధాన మురికి కాలువ పై గత కొన్ని సంవత్సరాలుగా కొందరు అక్రమంగా రేకుల షెడ్‌లు నిర్మించడం కారణంగా మురికి కాలువ పూర్తి స్థాయిలో పూడుక పోయింది. దీనికి తోడు గ్రామ సమీపంలో ఉన్న మైసమ్మ చెరువు కట్టను కొందరు పూర్తి స్థాయిలో తొలగించడంతో బారీగా వర్షం కురిసినప్పుడు పై నుండి వస్తున్న వరద నీరు కారణంగా ప్రధాన మురికి కాల్వలోని పూడిక తొలగించక పోవడం మేదరి కాలని ముంపుకు గురవుతోందని కాలనీ వాసులు ఆవేదన చెందుతన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో వరద ఉధృతి పెరుగడలను కాలనీ వాసులు గుర్తించలేక పోయారు. రాత్రి సమయంలో ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరడంతో దుస్తులు, నిత్యావసరాలు తడిసి ముద్దయ్యాయి. మరోవైపు విద్యుత్ సరఫర నిలిచి పోయింది. వృద్ధులు దేవుడి మీద భారం వేసి ఇళ్లలోనే ఉండి పోయారు. వీరికి కుబీర్ గ్రామ పంచాయతీ అప్పటి సర్పంచ్ మీరా విజయ్‌కుమార్ , మండల అధికారులు సమీప ఊర్థు మీడియం పాఠశాలలో ఐదు రోజుల పాటు ఉంచి కావాల్సిన వసతులు కల్పించారు. అప్పటి భయానక ఘటనను కాలనీ వాసులు ఇప్పటికి గుర్తు చేసుకుంటూ వణికి పోతున్నారు. గత పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని కాలనీల్లో ప్రభుత్వ ఆసుపత్రి, విఠలేశ్వర ఆలయంలో వరద నీరు మురికి నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



భైంసా ఏరియా ఆసుపత్రి ఓపీ విభాగం ముందు బారులు తీరిన రోగులు



భైంసా ఏరియా ఆసుపత్రిలో చిన్న పిల్లల ఓపీ విభాగంలో నెలకొన్న రద్దీ

మొదలైన వర్షాకాలపు వ్యాధుల బెడద

● వాతావరణ మార్పులతో అనారోగ్యపాలవుతున్న ప్రజలు ● రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

భైంసా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో వర్షాకాలపు వ్యాధుల బెడద అప్పుడే మొదలయింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల వాసులకు వ్యాధుల బెడద మొదల యింది. పలు ప్రాంతాల్లో వైరల్ జ్వరాల బెడద ఆరంభం అవ్వగా, మరి కొన్ని ప్రాంతాల్లో జ్వరం, జలుబు, దగ్గు, దమ్ము వ్యాధుల తీవ్రత అధిక మవుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల జ్వరాలు విజృంభి స్తున్నాయి. వైరల్ ఫీవర్ల వ్యాప్తి పేరుగుతోంది. ముఖ్యంగా మురికి కాలనీల్లో నివాసముండే ప్రజలు జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. తల నొప్పి, వాంతులు, విరేచనాలు, గ్యాస్టిక్ వంటి జబ్బులతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

● ఇలాంటి సీజన్‌లో చురుగ్గా వైరస్..

ఎండ, వానల వల్ల వాతావరణంలో విభిన్న పరిస్థితులు చోటు చేసుకోవడంతో వైరస్ ప్రబలేందుకు ఈ వాతావరణం అనుకూలంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒకసారి వర్షం పడి ఆగిపోతే వైరస్ ప్రభావం అంతగా ఉండదు కానీ.. ఒకే రోజు ఆగి ఆగి వర్షం పడడంతో వైరస్ విజృంభించే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో తేమ ఎక్కువ కావడంతో బ్యాక్టీరియా, వైరస్ వంటివి ఈ కాలంలో బలంగా మారి జనంపై దాడి చేసే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. ఆస్తమా, శ్వాసకోశ వంటి వ్యాధులున్న వారు తీవ్ర అస్వస్థతకు గురైతే వారికి వెంటిలేటర్ ద్వారా ఇవ్వాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

● కలుషిత నీళ్లు, ఆహారంతో ముప్పు..

వాననీళ్లు, డ్రైయినేజీ నీళ్లతో మంచినీళ్లు కలుషితమయ్యే అవకాశం ఉంది. ఇవి గ్యాస్ట్రో ఎంటరాలజీ సమస్యలకు దారి తీస్తాయి. ఇటువంటి వాతావరణంలో డ్రైయినేజీ, వర్షపు నీరు కలిసిన నీళ్లను తాగడంతో కడుపునొప్పి, కడుపు మంట, విరేచనాలు, వాంతులు, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహారం తడిసిపోతుంది. దీనిని తిన్న వారు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది.

● మలేరియా, డెంగీతో ముప్పు..

ఈ వర్షాలతో గుంతల్లో నీళ్లు నిలిచి ఉండడంతో దోమలు పెరుగుతాయి. ఇవి మలేరియా, డెంగీ వ్యాధులను విస్తరింపజేస్తాయి. జ్వరం వచ్చి తగ్గుంతుండటం, చలి, శరీరంలో నొప్పులు, తల నొప్పి వంటి లక్షణాలతో వ్యాధి ప్రారంభం అవుతుంది. దోమకాటు నుంచి కాపాడుకో గలిగితే మలేరియా, డెంగీ వ్యాధులు దరిచేరవు. ఈ కాలంలో ఇళ్లలో దోమ తెరలు వాడాలి. అలాగే పరిసరాలలో చిన్న చిన్న గుంతల్లో నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చుట్టు పక్కల ప్రాంతాల్లో డీడీటీ లాంటి పౌడర్లను చల్లుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

● ఈ జాగ్రత్తలు అవసరం..

- కాచి చల్లార్చి నీటిని తాగాలి
- చల్లటి వాతావరణంలో ఎక్కువగా తిరగకుండా జాగ్రత్తగా పడాలి
- వెచ్చటి దుస్తులు ధరించాలి
- తేలికైన మంచి ఆహారాన్ని అవసరం మేరకు తీసుకోవాలి..
- కొవ్వు ఆహారం, నాన్‌వెజ్ దూరంగా ఉండాలి
- ఆయిల్ చాలా మేరకు తగ్గించాలి
- దగ్గు వస్తే చేతి రూమాలు నోటికి అడ్డంగా పెట్టుకోవాలి
- ఒకసారి వినియోగించిన చేతిరూమాలను వేడినీటిలో నానబెట్టి ఉతికిన తర్వాత వాడాలి.
- జ్వరం వచ్చి తగ్గుతుంటే డాక్టర్ల సలహా మేరకు రక్త పరీక్షలు చేయించుకోవాలి.
- ఏ సమయంలోనైనా వేడి ఆహారం తీసుకోవడం ఉత్తమం
- పండ్లు, కూరగాయాలు, పాలు, చపాతీలు ఎక్కువగా తీసుకోవాలి
- ఈగలు, దోమలు మునిరే ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయాలి.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, BOTTUR MANJULA (OLD NAME) R/O.H.NO: 5-46, BATTI GALLI, KUBEER, NIRMAL, T.S. I HAVE CHANGED MY SURNAME AS BATTHUR MANJULA (NEW NAME) W/O. BATTHUR RAMESH

AJZ 234353

CHANGE OF NAME

I, BOTTUR RAMESH (OLD NAME) R/O. H.NO:5-46, BATTI GALLI, KUBEER, NIRMAL, T.S. I HAVE CHANGED MY SURNAME AS BATTHUR RAMESH (NEW NAME) S/O BATTHUR POTHANNA

AJZ 234353

CHANGE OF NAME

I, SINDU LINGANNA S/O. CHINNA LINGANNA SINDU (OLD NAMES) R/O. H. NO:2-15, KAMALKOT (VILL.), MAMADA (MON.), NIRMAL (DIST.), TG HAVE CHANGED MY & MY FATHERS NAMES AS GAJJELA RAJALINGU S/O. GAJJELA LINGANNA

AJZ 234304

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు...
క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672

ఉపాధి సోషల్ ఆడిట్ ఉత్తిదే



- కొనసాగుతున్న అక్రమాల పరంపర
- రికవరీలపై నిండా నిర్లక్ష్యం
- అక్రమార్కులపై చర్యలు కరువు
- జిల్లాలో కోటి రూపాయలకు పైగా అవకతవకల నిర్ధారణ

నిర్మల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నాలుగు ఏళ్ల నుంచి జిల్లా ఉపాధి హామీ కింద చేపట్టిన వివిధ రకాల పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి హామీ సిబ్బంది చేతివాటంతో చేయని పనులను చేసినట్లు చూపించి ఉపాధి కూలీల వేతనాలను స్వాహా చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ పథకం కింద చేపట్టిన పనులు, చెల్లింపులకు సంబంధించి నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ ప్రక్రియపై కూడా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న అక్రమాలపై అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులిపేస్తున్నారంటున్నారు. రికవరీలు అలాగే అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు లాంటి వ్యవహారంలో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం అమలులో అనేక సాంకేతికపరమైన మార్పులు, సంస్కరణలు చేపట్టి నిర్వహణ అంతా ఆన్‌లైన్‌లో పకడ్బందీగా కొనసాగిస్తున్నప్పటికీ అవకతవకలకు మాత్రం పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఉపాధి హామీ పనులు చేపడుతున్న దృశ్యం (ఫైల్)

2016 నుంచి జిల్లాలో దాదాపు కోటి రూపాయలకు పైగా అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ ద్వారా నిర్ధారణ అయ్యింది. అయితే ఇందులో నుంచి ఇప్పటి వరకు కేవలం 37 లక్షల 44 వేల రూపాయలు మాత్రమే రికవరీ అయినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మరో 61 లక్షల 93 వేల రూపాయలను అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ఇంత పెద్దమొత్తంలో రికవరీ చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, చెరువులు, కుంటలు, బావులలో పూడిక తీత, వ్యవసాయ క్షేత్రాలను చదును చేయడం, వైకుంఠధామాలు, రైతు వేదికలు, పంట కల్లాల నిర్మాణం పనులను సైతం చేపట్టారు. అయితే ఈ పనులలో కూలీలకు చెల్లించిన వేతనాలు అలాగే తదితర ఆర్థికపరమైన అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. చాలా గ్రామాల్లో సోషల్ ఆడిట్ ద్వారా పెద్ద ఎత్తున అవకతవకలు వెల్లడయ్యాయి. సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బంది ఈ పనులకు సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు సైతం నిర్ధారణ అయ్యింది. అయితే సోషల్ ఆడిట్‌లో పూర్తి వివరాలను వెల్లడించి నప్పటికీ చర్యల విషయంలో మాత్రం అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

నిండా నిర్లక్ష్యం

ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న పనుల లో పెద్ద ఎత్తున నిర్లక్ష్యం జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది కూలీలు పనులు చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారని అంటున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ కింద చేపడుతున్న పనులకు సంబంధించిన ప్రదేశాలలో ఎలాంటి సమాచారం అందుబాటులో ఉంచడం లేదని అలాగే ఖర్చులకు సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పకడ్బందీగా పర్యవేక్షించకపోతుండడం అలాగే కూలీలు చేపట్టే పనుల విషయంలో దృష్టి సారించకపోతుండడం, హాజరు విషయంలో కూడా పెద్దగా దృష్టి పెట్టకపోతుండడం లాంటి వ్యవహారాలు ఈ పథకం అమలులో అవినీతిని నిరోధించలేక పోతుండడానికి ఆస్కారమిస్తున్నాయంటున్నారు.

ప్రభావం చూపని సంస్కరణలు

కాగా ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి జరుగుతున్నట్లు నిర్ధారించిన కేంద్రప్రభుత్వం సరికొత్త సాంకేతిక సంస్కరణలు తెరపైకి తెచ్చింది. పథకం అమలును మరింత పకడ్బందీగా చేపట్టి కూలీలందరికీ ఉపాధితో పాటు చెల్లింపులు జరపాలన్నదే ప్రధానలక్ష్యంగా పెట్టుకొని ఆన్‌లైన్ వ్యవహారాన్ని అమలు చేస్తున్నారు. కూలీల ఖతాలన్నింటినీ ఆధార్‌తో అనుసంధానం చేసి బినామీ కూలీలు తెరపైకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందు కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)ను అమలు చేస్తున్నారు. పని చేసే స్థలం నుండి కూలీలు తమ ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాము పని చేసే చోటు నుండే ఫోటోలు దిగి వాటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని కారణంగా కూలీల సంఖ్యతో పాటు వారు చేస్తున్న పనుల విషయాలు ఎప్పటికప్పుడు సంబంధితశాఖ ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ విధానంతో వెల్లడి కానున్నాయి. దీనికోసం గాను సాటిలైట్ సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు. అయితే ఇంత పెద్ద ఎత్తున సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పటికీ అవకతవకలను మాత్రం పూర్తిస్థాయిలో అడ్డుకోలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్‌లో ట్రిపుల్‌ఐటీ కార్మికుల ధర్నా

- లేబర్ కమిషన్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న యూనివర్సిటీ కార్మికులు

బాసర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో పని చేసే కార్మికులు గురువారం హైదరాబాద్ లేబర్ కమిషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. గత కొన్ని రోజుల నుంచి వివిధ సమస్యలపై కార్మికులు నిరసన తెలుపుతూనే ఉన్నారు. క్యాంపస్ వద్ద ఆందోళన చేసిన సమయాల్లో ప్రతీసారి యూనివర్సిటీ అధికారులు హామీలు ఇవ్వడం ఆందోళన విరమిస్తున్నారు. కలెక్టర్, కార్మికశాఖ అధికారులకు కూడా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కానీ వారు సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో రాజధానిలో నిరసన చేపట్టారు. భారత్ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎవరికి విన్నవించినా సమస్యలు పరిష్కరించకపోవడంతో ఇక్కడ నిరసన చేపట్టాల్సిన వచ్చిందని కార్మికులు చెప్పారు. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

భైంసా,జూన్19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో పలువురు వ్యాపారులు ఎరువులను అధికధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అరకొరగా సరఫరా అవుతున్న ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువ ధరలతో అమ్మకాలు చేపడుతున్నారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. పరిచయం ఉన్న రైతులకు మాత్రమే ఎరువులను విక్రయిస్తూ మిగతా రైతాంగానికి ఎరువులు స్టాక్ లేదని బుకాయిస్తున్నట్లుగా సమాచారం. సంబంధిత విషయంలో గురువారం కుభీర్ మండలంలోని రంగశివుని గ్రామానికి చెందిన సంపత్ పాటిల్ అనే రైతు ఒకరు ఎరువుల అధిక ధరల విక్రయాలపై భైంసా వ్యవసాయాధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది. ఈ విషయమై భైంసా మండల వ్యవసాయాధికారి గణేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఫోన్ ద్వారా రైతు ఫిర్యాదు చేసాడని పేర్కొన్నారు. సంబంధిత విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి మోహన్‌సింగ్

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ ద్వారా విద్య అభ్యసించే పేద మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీలు) ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి మోహన్ సింగ్ తెలిపారు. 2025 సంవత్సరం స్ప్రింగ్ ప్రవేశాలకు విదేశీ విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పీహెచ్‌డీ కోర్సులు చదువుకునేందుకు ఉపకార వేతనాలు ఆర్థిక చేయూత మంజూరు కొరకు అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 15 లోగా సమర్పించాలని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు గురువారం మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన బెజ్జారపు శౌర్య జిల్లా స్థాయికి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


దిలావర్‌పూర్‌లో నర్సరీని సందర్శిస్తున్న డీపీవో

దిలావర్‌పూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. రోడ్లపై, రోడ్లకు ఇరువైపులా చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలుంటే వెంటనే తొలగించాలన్నారు. లేదంటే గడ్డి మందు పిచికారీ చేయాలని చెప్పారు. మురికి కాలువల్లో నీరునిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో పిచ్చి మొక్కలతో పాటు అపరిశుభ్రత ఉండకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలే కాకుండా విషపు పురుగులు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మంచినీటి పైపులు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం నర్సరీని సందర్శించారు. వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. డీపీవో వెంట పంచాయతీ ఈవో చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ సహాయకులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కుభీర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శివసాయి ఆలయం ముందు గల కచ్చడ్రైన్‌లోని పూడికలను యంత్రాల సహాయంతో తొలగించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు తాగు నీటి వనరుల వద్ద మురికి నీరు చేరకుండా చర్యలు చేపడుతూ మినీట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. దోమలు, ఈగల నివారణ కోసం మురికి కాలువలో బ్లీచింగ్ చేశారు.

జొన్నల డబ్బులు విడుదల

కుంటాల, జూన్, 19 : (ఆంధ్రజ్యోతి) : రైతులు రబీ సీజన్‌లో పండించిన జొన్నల డబ్బులు విడుదలైనట్లు మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణ రావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారిలు తెలిపారు. గురువారం కుంటాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో రైతుల పెట్టుబడి కోసం డబ్బులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమవుతున్నాయని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికి రైతుల ఆర్థిక పరిస్థితి బాగుండాలనే ఉద్దేశ్యంతో వారి విన్నపం మేరకు గురువారం నుంచి జొన్నల డబ్బులను ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్నతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం

కుంటాల, జూన్, 19 : (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు పసుల నవీన్ అన్నారు. గురువారం కల్లూరు వారసంతలో నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టరవి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్ రెడ్డి, బాలు, గంగారెడ్డి, దాస్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

కుభీర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కళ్యాణ్, వైస్‌చైర్మన్ హైమ్మత్‌లను గురువారం రైతువేదికలో గ్రామపెద్దలు, యువకులు ఘనంగా సన్మానించారు.

రైతులకు బాసటగా రైతు భరోసా

- బుధవారం నాటికి 156.95 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ
- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకం క్రమంగా రైతులకు నిధులు అందజేస్తోందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం నాటికి జిల్లాలో మొత్తం రూ.156.95 కోట్ల రైతు భరోసా నిధులు విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. జిల్లాలో ఉన్న మొత్తం 1,86,400 మంది రైతుల్లో 1,54,195 మంది ఖాతాల్లోకి డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నిధులు చేరాయని వివరించారు. మిగిలిన రైతులకు త్వరలోనే నిధులు జమ కానున్నట్లు తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ఈ పథక ప్రయోజనమని పేర్కొన్నారు. పెట్టుబడి భారం తగ్గడం వల్ల సాగు పనులను ముందుగానే ప్రారంభించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. చివరి గుంట భూమి వరకు రైతులకు రైతు భరోసా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట ప్రారంభానికి ముందే నిధులు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయి

సారంగాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు గ్రామస్థులకు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సారంగాపూర్ మండలంలోని జామ్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు ఎన్నో సంవత్సరాలుగా మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ప్రజలంతా గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొని తమ సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సదస్సులో రైతులు సమర్పించిన ప్రతి దరఖాస్తుపై రసీదు ఇవ్వాలని, పూర్తి వివరాలు రిజిస్ట్రర్‌లో నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే.. సర్వేయర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, శుభ్రత పట్ల నిరంతర శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాకులకు సూచించారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిక్షించారు. పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి ఇప్పటి నుంచే లక్ష్యాలను ఏర్పర్చుకొని బోర్డు పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతున్నట్లు ప్రజల్లో విశ్వాసం పెరిగేలా విద్యా బోధనను అందించి విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు యూనిఫాంలు, సైన్సు పరిజ్ఞానాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇటీవలే జాతీయస్థాయిలో అభిలాష్(నెట్‌బాల్), రమ్య(బేస్‌బాల్) విద్యార్థులు విశిష్ట ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు, రైతులు ఉన్నారు.


మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆపత్కాల స్పందనకు ముందస్తు సన్నద్ధత

- ప్రజల రక్షణ కోసం నిర్మల్ డివిజన్ బంగల్‌పేట్ చెరువు వద్ద ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో 82 మందికి ప్రత్యేక శిక్షణ


శిక్షణలో చెరువులో పడిన వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు


పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎన్నడు లేని విధంగా జిల్లాలో డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ని వాతావరణ సూచనల మేరకు రాబోయే వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ఈ స్పెషల్ ఫోర్స్‌ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ డివిజన్ బంగల్‌పేట్ చెరువు వద్ద డీడీఆర్ఎఫ్ బృందానికి నిపుణుల చేత రెస్క్యూ ఆపరేషన్ ట్రైనింగ్ ఇచ్చారు. రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న బాధితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీడీఆర్ఎఫ్ బృందానికి ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని బంగల్‌పేట్ చెరువులో రెస్క్యూ ఆపరేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీడీఆర్ఎఫ్ బృందంలోని సభ్యులు చెరువులో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే విధానాన్ని చూపించారు. డీడీఆర్ఎఫ్ బృందానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆర్ఐ రమేష్ రెస్క్యూ ప్రక్రియ మొత్తాన్ని ఎస్పీకి వివరించారు. జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డీడీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని, టీంతో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో నుండి ముగ్గురికి ట్రైనింగ్ ఇవ్వటం జరిగింది. ఇట్టి ట్రైనింగ్ పొందినవారు విపత్కర పరిస్థితుల్లో అక్కడ ప్రజల సహకారంతో డీడీఆర్ఎఫ్ బృందం వచ్చే వరకు ప్రజలను కాపాడడం జరుగుతుందని ఎస్పీ ఈ సందర్భంగా తెలియజేశారు. మొత్తం 82 మంది పోలీస్ సిబ్బందిని ట్రైనింగ్‌కు తీసుకోవటం జరిగింది. ముఖ్యంగా బంగల్‌పేట్ చెరువు పరిసర ప్రాంతాలలో వరదలు సంభవించినప్పుడు ఈ పరిసర ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రజలను సంరక్షించడానికి ఈ బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైవ్ జాకెట్స్, లైఫ్ బాయ్ రింగ్స్, బోట్ పెడల్స్, రోప్స్, ఇతర సామాగ్రి మొత్తాన్ని ఈ బృందానికి సమకూర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు ప్రవీణ్ కుమార్, కృష్ణ, డీడీఆర్ఎఫ్ ఇన్‌చార్జి రమేష్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, రెస్క్యూ టీమ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

తానూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌కు చెందిన హెమ్లే అనిత(25) అనే వివాహిత మహిళ అదృశ్యం అయినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... హెమ్లే అనిత బుధవారం ఇంట్లో నుంచి మధ్యాహ్నం టేలర్‌షాపునకు వెళ్లి వస్తానని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అనిత యొక్క భర్త రమేష్, అత్తమ్మలు ఆచూకి కోసం ఎంత వెతికిన దొరకలేదు. చుట్టు పక్కల వాళ్లకి అడిగి, బంధువులకు ఫోన్ చేసిన ఎవరు రాలేదని చెప్పడంతో గురువారం భర్త రమేష్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొలుసు చోరీకి ప్రయత్నించిన మహిళ అరెస్ట్

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గొలుసు చోరీకి యత్నించిన మహిళను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 18న సాయంత్రం సుమారు 5 గంటలకు బస్టాండ్ పరిసర ప్రాంతంలో సారంగాపూర్ మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన పిట్ల సాయవ్వ అనే మహిళ వెనుక వైపు నుండి బంగారు గొలుసును కత్తిరించి దొంతనం చేయడానికి ప్రయత్నించిన కుభీర్ మండలంలోని రంగా షివిని గ్రామానికి చెందిన దండోళ్ల గంగామణి అనే మహిళను గురువారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మహిళ వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, దొంగతనం చేయడానికి ఉపయోగించిన కత్తెరను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పట్టణ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సందీప్‌లను ఎస్పీ డా. జి.జానకీషర్మిల అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు పత్రిక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శాంతినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతినగర్, గాయత్రి టౌన్ షిప్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, హౌజింగ్ బోర్డు కాలనీ ఏరియాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

ప్రజలకు సొంత వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు

- నర్సాపూర్(జి)లో విస్తృత తనిఖీలు

నర్సాపూర్(జి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం దిలావర్‌పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, మండల కేంద్రంలోని పలువురు ఆర్ఎంపీ (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్), ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్, హోమియోపతి వైద్య విధానం ప్రాక్టీస్ చేసే వారితో పాటు చిన్నారులకు వైద్యం చేసే వారి క్లినిక్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీహెచ్‌వో రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్లు శేఖర్, శకుంతల, ఇతర ఆరోగ్య సిబ్బంది ఆమె వెంట ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ... రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్ఎంపీ)లు, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ)లు, హోమియోపతి వైద్యులు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, తమకు వైద్య పరంగా అర్హత లేని చికిత్సలను రోగులకు అందించవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు 'సొంత వైద్యం' చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. కొందరు వైద్యులు తమ పరిధికి మించి ఇంజెక్షన్లు, ఐవీ (ఇంట్రావీనస్) సెలైన్‌లు, అధిక మోతాదులో మాత్రలు ఇస్తూ వైద్యం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మెడికల్ షాపుల యజమానులు కూడా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎటువంటి మందులు విక్రయించరాదని డాక్టర్ ప్రియాంక ఆదేశించారు. డాక్టర్ ప్రియాంక తనిఖీలకు వస్తున్నారని తెలియగానే పలు మెడికల్ షాపులు, క్లినిక్‌లు మూసి వేసి కనిపించాయి. ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా అర్హత లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకుని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని డాక్టర్ ప్రియాంక విజ్ఞప్తి చేశారు.